
# ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు రాజకీయ మనుగడ కోసమే

**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రూ.150 కోట్ల అవినీతి వ్యవహారం నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చారని ప్రజలు భావిస్తున్నారని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు సామ మహేందర్ రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో మాజీ మేయర్ దంపతులు సబితా ఇంద్రారెడ్డి ప్రమేయం ఉందని చేసిన వ్యాఖ్యలు సత్యదూరమైనవి, హాస్యాస్పదమైనవన్నారు. ఈ ఆరోపణలను బీఆర్ఎస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ముందుగా రూ.150 కోట్ల అవినీతి ఆరోపణలపై సిట్ విచారణకు ఆదేశించాలన్నారు. సాధారణంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని భావించిన వ్యక్తులే ఫిర్యాదు చేస్తారు. కానీ అధికారులే పిలిచి మీ ఫోన్ ట్యాపింగ్ అయిందని విచారణకు రమ్మనడం, వారు వెళ్లడం



అనుమానాలకు తావిస్తోందన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా విచారణ చేస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన ఆధారాలు గానీ, పురోగతి గానీ చూపలేకపోయిందన్నారు. దీంతో ఈ వ్యవహారం రాజకీయ ప్రేరేపితమనే అనుమానాలు మరింత బలపడుతున్నాయన్నారు. మాజీ మేయర్ దంపతులు ఒక విషయం గుర్తుంచుకోవాలని, వారికి మేయర్ పదవి దక్కేందుకు సబితా ఇంద్రారెడ్డి సహకారం, ప్రోత్సాహం కీలక పాత్ర పోషించిందన్నారు. అలాగే బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రూ.150 కోట్ల అవినీతి వ్యవహారంపై సిట్ విచారణ ఎందుకు జరపడం లేదో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. ధైర్యం, నిజాయితీ ఉంటే వెంటనే విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కు ఎవరి ఫోన్ ట్యాపింగ్ చేయించాల్సిన అవసరం లేదన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పై చేస్తున్న నిరాధార ఆరోపణలకు కాలమే సమాధానం చెబుతుందన్నారు. మాజీ మేయర్ దంపతులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పై చేసిన అసత్య ఆరోపణలు, సత్యదూరపు వ్యాఖ్యలు మానుకొని వెంటనే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని,బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో చిగురింత పారిజాత నరసింహారెడ్డి దంపతులను విచారించిన సిట్ అధికారులు



**మన తొలివెలుగు, సిటీ బ్యూరో ప్రతినిధి** ఫోన్ ట్యాపింగ్ కేసులో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ చిగురింత పారిజాతను ఆమె భర్త నరసింహారెడ్డిని బంజారాహిల్స్ లో సిట్ అధికారులు విచారించారు. వారిద్దరి స్టేట్ మెంట్ ను రికార్డు చేశారు. ఫోన్ టాపింగ్ చేసిన కేసును వేగవంతం చేశారు. రెండో చార్జ్ షీట్ దాఖలు చేశారు. 30 నిమిషాల పాటు వారిద్దరి స్టేట్మెంట్లను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. బయటకు వచ్చిన అనంతరం మాజీ మేయర్ మాట్లాడుతూ.. 2022 ఏడాది నుండి ఎన్నికల సమయంలో మా ఇద్దరి ఫోన్లు ట్యాపింగ్ కి గురైనట్టు అధికారులు చెప్పారన్నారు. అధికారులు చెప్పేవరకు మా ఫోన్లు ట్యాపింగ్ కు గురైందన్న విషయం మాకు తెలియలేదన్నారు. భార్యా భర్తలిద్దరి ఫోన్లు ట్యాప్ చేయడం దురదృష్టకరమన్నారు. నిరంతరం ప్రజా సేవలో మమేకమై ఉండడంతో మా ఫోన్లు ట్యాపింగ్ జరిగినట్లు గుర్తించలేకపోయామన్నారు. గత ప్రభుత్వంలో మహిళా నేత, మాజీ మంత్రి మాపై ఇంత కక్ష్యతో వారికి నియోజకవర్గం లో మేము పోటీగా ఉంటామని... దగ్గరుండి ఫోన్ ట్యాపింగ్ చేశారనే అనుమానం ఉందని తెలిపారు. ఎన్నికల సమయంలో మా కదలికలపై నిరంతరం నిఘా పెట్టేవారు. కానీ అది ట్యాపింగ్ చేసి అనే విషయం ఇప్పుడు గుర్తించామన్నారు. మేము చేసే కార్యక్రమాలకు అడుగడుగున అడ్డు పడేవారు.. మా వ్యూహాలను ముందే పసిగట్టి ఎవరెవరు మాతో కలసి పని చేయాలనుకుంటున్నారు వారికి బెదిరింపులు గురి చేసేవారు. మహేశ్వరం నియోజకవర్గంలో మమ్మల్ని ఎదగకుండా అడ్డుకోవడానికి ఈ విధమైన చర్యలు చేపడతారని గుర్తించలేకపోయమన్నారు. సిట్ పై పూర్తి నమ్మకం ఉందన్నారు. రేవంతన్న ప్రభుత్వం తప్పకుండా మాకు న్యాయం చేస్తారని నమ్మకం ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలైన నిందితులకు త్వరలోనే శిక్ష పడుతుందనీ నమ్ముతున్నామన్నారు.

## ప్రధాన రహదారిపై మురుగునీరు



**మన తొలివెలుగు, చాంద్రాయణగుట్ట ప్రతినిధి శైలేష్ కుమార్ :** కందికల్ గేట్ ఫ్లైఓవర్ ప్రధాన రహదారిపై డ్రైనేజీ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. ఇప్పటికే రోడ్డు మధ్యలో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన, వెదజల్లుతుంది. వర్షాలు పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు పూర్తిగా పొంగి మురుగునీరు ఇళ్లలోకి, షాపుల్లోకి చేరుతోంది. రోడ్డు మొత్తం మురికి నీరు చెరువులా మారి వాహనాలు నడపడం కష్టంగా మారింది. వాహనదారులు, పిల్లలు, వృద్ధులు జారిపడి, గాయపడే ప్రమాదం ఎక్కువగా ఉంది. మురుగునీరు నడిచే వారిపై చిల్లడం జరుగుతుంది. వర్షాకాలం మొదలయ్యే ముందే డ్రైనేజీ వ్యవస్థను శుభ్రం చేయాలి. పాడైన పైపులను మార్చి, ఉపశమనంగా రోడ్డుపై బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ప్రజలు కోరుతున్నారు. హెచ్ ఏం డబ్ల్యూఎస్ ఎస్బీ, జీహెచ్ఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## గ్రామ పరిశుభ్రత ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలి



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** రాబోయే వర్షాకాలంలో గ్రామ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, గ్రామ పరిశుభ్రత ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ హనుమతు నాయక్, ఉపసర్పంచ్ ఆర్. తేజ నాయక్ అన్నారు. దావూద్ గూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన కల్పించారు. వారి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణ కోసం దోమతెరలు వాడాలన్నారు. మురుగు కాలువలు, డ్రైనేజీలలో చెత్త వేయకుండా చూడాలన్నారు. విద్యుత్ స్తంభాలు, వైర్లు దెబ్బతిన్నట్లయితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. తాగునీటిని మరిగించి వినియోగించాలని ప్రజలను కోరారు. చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామ ప్రజలందరూ వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి, గ్రామ పరిశుభ్రత ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని గ్రామ పంచాయతీ కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వి. రవీందర్ నాయక్, చిన్న నాయక్ కందుకూర్ ఏఈ సతీష్ రెడ్డి, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ ఏఈఓ జగతీష్, కందుకూర్ పోలీస్ డిపార్ట్మెంట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈ వారంలో ఇంటర్ సప్లిమెంటరీ రిజల్ట్స్

**హైదరాబాద్ :** తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 21వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. ఇక ఈ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ కూడా ముగిసింది. ఈ క్రమంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు విద్యాశాఖ కీలక సమాచారం వెల్లడించింది. ఫలితాలను మరో 5 రోజుల్లోనే వెల్లడించనున్నట్లు తెలిపింది. అంటే జూన్ 10వ తేదీలోపు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు ఇంటర్ బోర్డు విడుదల చేయనుంచి. ఈ మేరకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.ఇప్పటికే జవాబు పత్రాల మూల్యాంకనం, స్కానింగ్ ప్రక్రియలు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం ఫలితాల విడుదలకు సంబంధించిన తుది

## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

**సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడిని గాంధీ ఆస్పత్రికి తరలింపు**




**మన తొలివెలుగు, తెలంగాణ బ్యూరో రిపోర్టర్ కనుగుల సాయికిషోర్ :** హైదరాబాద్ నగరంలో ఎబోలా వైరస్ అనుమానిత కేసు కలకలం రేపింది. సూడాన్ దేశం నుంచి గురువారం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) శంషాబాద్‌కు చేరుకున్న ఓ ప్రయాణికుడిలో ఎబోలా వైరస్‌కు సంబంధించిన లక్షణాలు కనిపించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. విమానాశ్రయంలో వైద్య పరీక్షల సందర్భంగా ప్రయాణికుడి ఆరోగ్య పరిస్థితిని గుర్తించిన అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రత్యేక అంబులెన్స్‌లో అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నారు. రోగి నుంచి రక్త నమూనాలను సేకరించిన వైద్యులు వాటిని నిర్ధారణ పరీక్షల కోసం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ)కి పంపించారు. ప్రస్తుతం పరీక్షల ఫలితాల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. ఫలితాలు వచ్చిన తర్వాతే ఎబోలా వైరస్ సోకిందా లేదా అన్నది స్పష్టత రానుంది. ఇటీవల కొన్ని ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాధి వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్రంలోని అన్ని అంతర్జాతీయ ప్రవేశ కేంద్రాల వద్ద నిఘాను మరింత కట్టుదిట్టం చేసింది. విమానాశ్రయాల్లో ప్రయాణికుల ఆరోగ్య పరీక్షలను ముమ్మరం చేసింది. తెలంగాణలో ఎబోలా వ్యాధి నిర్వహణ కోసం గాంధీ ఆస్పత్రిని అధికారిక నోడల్ కేంద్రంగా గుర్తించారు. ఎలాంటి అనుమానిత కేసులనైనా ఎదుర్కొనేందుకు ప్రత్యేక ఐసోలేషన్ సదుపాయాలు, శిక్షణ పొందిన వైద్య బృందాలు సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. అధికారులు ప్రజలను ఆందోళన చెందవద్దని సూచిస్తూ, ప్రస్తుతం ఇది కేవలం అనుమానిత కేసు మాత్రమేనని, పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**జోనల్ కమిషనర్ చంద్రకళకు వినతి**



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య :** ప్రజా సమస్యలు పరిష్కరించాలని జోనల్ కమిషనర్ చంద్రకళకు బీజేపీ రాష్ట్ర నేత కొలన్ శంకర్ రెడ్డి బీజేపీ శ్రేణులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోలన్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్ లోని బడంగ్ పేట సర్కిల్ పరిధిలోని 60 వ డివిజన్ లోని దాతునగర్, సాయి గణేష్ నగర్, సుభాష్ చంద్రబోస్ కాలనీ, సాయి కృప కాలనీ, జయభారత్ నగర్ ఆఫీసర్స్ కాలనీ లలోని గుంతలు గుంతలు గా మారిన రోడ్లతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రహదారులకు మరమ్మతులు చేయాలన్నారు. పార్క్ ఏరియాలో పండగల ఉత్సవాల కొరకు షెడ్ నిర్మాణం చేపట్టాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు, దోమల నివారణకు ఫాగ్ చేయాలని, తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన వినతి పత్రాన్ని శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళకి అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సత్యప్రకాష్ జీ, గంగవరం సురేష్, జై కాంత్ గుప్తా, దినేష్ , తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో మంచి గుర్తింపు కీర్తి ప్రతిష్టలను పొందాలి



**ట్రిబుల్ ఐటీ సీటు సాధించిన రఘుపతికి ఘన సన్మానం**



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య ముదిరాజ్ :** విద్యార్థులు తమ చదువుపై శ్రద్ధ పెట్టి, బాగా కష్టపడి చదవడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకుని, సమాజంలో పేరు, కీర్తిని సంపాదించుకోవాలని జెడ్పీహెచ్ఎస్ (బి) తుక్కుగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి అన్నారు. తుక్కుగూడ మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ (బి) తుక్కుగూడ పాఠశాలకు చెందిన విద్యార్థి రఘుపతి ప్రతిష్టాత్మక ట్రిబుల్ ఐటీ బాసరలో సీటు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని రఘుపతి నిరూపించాడని అన్నారు. అతని విజయం పాఠశాలకు గర్వకారణమని, ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బుగ్గ రాములు, మల్లారెడ్డి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని రఘుపతిని అభినందించారు. విద్యార్థి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


## నెలల తరబడి కొనసాగుతున్న రోడ్డు పనులు

**ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**


**మన తొలివెలుగు, చాంద్రాయణగుట్ట ప్రతినిధి శైలేష్ కుమార్ :** ఛత్రినక చౌరస్తా నుండి ఉప్పుగూడ వెళ్ళే ప్రధాన రహదారిలో గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న మరమ్మత్తు పనుల వల్ల స్థానికులు, వాహనదారులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా తొవ్వడంతో, రాళ్లు, మట్టి కుప్పలు పడి ఉన్నాయి. కాంట్రాక్టర్లు చేస్తున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధూళి, దుమ్ము, బురద వల్ల పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నెమ్మదిగా వెళ్లాల్సి రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. రోడ్డు పక్కన ఉన్న షాపులు, ఇతర వ్యాపారాలకు కస్టమర్స్ రాక ఆదాయం దెబ్బతింటోంది. వృద్ధులు, మహిళలు రోడ్డు దాటేందుకు చాలా ఇబ్బంది పడుతున్నారు. పనులు వేగంగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు, తాత్కాలిక పాదచారుల దారి ఏర్పాటు చేయాలని, ఆలస్యానికి కారణమైన కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి, ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

## శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులు




**మన తొలివెలుగు, చాంద్రాయణగుట్ట ప్రతినిధి శైలేష్ కుమార్ :** ఉప్పుగూడ హనుమాన్ నగర్ పరిసర ప్రాంతాల్లో కొలువైన శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో ప్రస్తుతం మరమ్మత్తు, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఆలయం చుట్టూ ప్రహరీ గోడకు మరమ్మతులు చేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం కొత్త మెట్లు, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్థానిక దాతల సహకారంతో ఈ పనులు చేపట్టారు. వర్షాకాలం ముందే పనులు పూర్తి చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు ఆలయ నిర్వాహకులు పగలు, రాత్రి అనకుండా పని చేస్తున్నారు. ఆలయ కమిటీ తెలిపిన మేరకు గర్భగుడి చుట్టూ రంగుల పని, కడప రాయి పరిచే పనులు జరగనున్నాయి. భక్తులకు తాగునీటి సౌకర్యం, ఆలయ ఆవరణలో పరిశుభ్రత, పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పనులు పూర్తయిన తర్వాత పునఃప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు.

## ప్రకాష్ రాజ్‌కు ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్ :** నటుడు ప్రకాష్ రాజ్‌కు ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. రీసెంట్‌గా పవన్ కల్యాణ్ తెలంగాణ ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పడంపై ప్రకాష్ రాజ్ పరోక్షంగా పోస్ట్ చేయగా దీనికి తనదైన శైలిలో గట్టిగా ఆన్సర్ ఇచ్చారు గణేష్. 'రండి దొర రండి... కానీ వచ్చే ముందు ఉత్తుత్తినే వస్తున్నారా? పొత్తుతో వస్తున్నారా? లేదా సింగల్‌గా వస్తున్నారా? అది చెప్పి రండి. మీరొస్తానంటే మేమొద్దంటామా?'

